క్లుప్తంగా

పరామర్శ



మల్హర్ : మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన న్యాయవాది శివకుమార్ తండ్రి ఇందారపు రాజయ్య మరణించాడు. గురువారం వారి కుటుంబ సభ్యులను పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కేసారపు చంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ ఇందారపు చంద్రయ్య, కాంగ్రెస్ జిల్లా యువజన నాయకులు మండల రాహుల్, నాయకులు ప్రభాకర్, సదయ్య, సింగిల్ విండో డైరెక్టర్ తిరుపతిరావు, అశోక్‌రావు ఉన్నారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య



పల్లవి (ఫైల్)

చిట్యాల: తల్లి అనారోగ్య కారణాలతో కూతురు తీవ్ర మనస్తాపం చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఒడితల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడితల గ్రామానికి చెందిన ఎర్రబెల్లి విజయ-సదానందం దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె పల్లవి(19) ఉన్నారు. తల్లి విజయ గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతూ ఉండేదన్నారు. ఆమె వైద్యఖర్చులకు లక్షల్లో కావాల్సి రావడంతో తల్లి అనారోగ్యంపై తీవ్ర మనస్తాపానికి గురై గురువారం తెల్లవారు జామున ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఈశ్వరయ్య తెలిపారు.

ఎఫ్ఎల్ఎన్ సర్వేపై శిక్షణ

భూపాలపల్లి అర్బన్ : ఎస్సీఈఆర్టీ ఆదేశాల మేరకు జిల్లాలో రెండో తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న ఎఫ్ఎల్ఎన్ సర్వేపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇన్వెస్టిగేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఏఎంఓ కాగిత లక్ష్మణ్ మాట్లాడుతూ రెండో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరీక్షించడం కోసం ఎంపిక చేసిన 50 పాఠశాలల్లో ఈ నెల 10 నుంచి 12వ తేది వరకు సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సర్వే కోసం డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌లుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సర్వే టాంజరిన్ యాప్‌లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు తౌటం స్వామి, రవికుమార్ స్పందన పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భూపాలపల్లి రూరల్ : ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని రాంపూర్ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. భూపాలపల్లి నుంచి మహాముత్తారం మండలం మీనాజీపేటకు బైక్‌పై వెళ్తున్న చంద్రమౌళి దంపతులను రాంపూర్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద అదే గ్రామానికి చెందిన వారి కారు వీరి బైక్‌కు ఢీకొంది. ఈ ఘటనలో చంద్రమౌళికి గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం భూపాలపల్లికి తరలించారు. అతని పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఎస్సై రమేష్ తన సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

గద్దెపై కొలువుదీరిన వనదేవతలు



మంగపేట : మండలంలోని మల్లూరు పంచాయతీ పరిధిలోని మామిడిగూడెంలో ఈనెల 4 నుంచి ప్రారంభమైన సమ్మక్క-సారలమ్మ జాతర మూడో రోజు వనదేవతలు గద్దెలపై గురువారం కొలువు దీరారు. ఆలయ దేవర బాల జనార్దన్ ఆధ్వర్యంలో మల్లూరు గుట్టపై సారలమ్మ తరపున వనదేవత అమ్మవారికి గిరిజన సాంప్రదాయప్రకారం పూజా రులు, వడ్డెలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమ్మక్క-సారలమ్మ గద్దెలపై అమ్మవారిని ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఎదురేగి దర్శించుకుని ప్ర త్యేక పూజలు నిర్వహించారు. గురువారం గద్దెపై కొలువు దీరిన సమ్మక్క వేల్పుల కర్రలతో సాయంత్రం 5 గంటల నుంచి పవిత్ర గోదావరిలో గంగస్నానానికి తోలుకొని వెళ్లారు. గద్దెలపై కొలువు దీరిన వనదేవతలను భక్తులు మనస్ఫూర్తిగా దర్శించుకుని వారి కోరికలు నెరవేర్చాలని వేడుకున్నారు. కార్యక్రమంలో వడ్డెలు రేగ లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, నిర్వాహకులు వాసం సాంబశివరావు, సాయి, చందు, నాగ మల్లేష్, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నెరవేరనున్న ప్రజల కల

- ప్రారంభం కానున్న 100 ఫీట్ల రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులు
- ఇళ్లకు, వ్యాపార సముదాయాలకు మార్కింగ్
- రోడ్డు వెడల్పుతో భారీగా నష్టపోనున్న వ్యాపారులు



ప్రారంభం కానున్న గణపురం ప్రధాన రహదారి

గణపురం : ఎట్టకేలకు మండల కేంద్రం రూపురేఖలు మారనున్నాయి. 20 ఏళ్లుగా 100 ఫీట్ల రోడ్డు, సెంట్రల్ లైటింగ్ కోసం ఎదురు చూస్తున్న కల నెరవేరే సమయం ఆసన్నమైంది. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నాలుగు నెలల క్రితం రూ.18 కోట్లతో పనులను ప్రారంభించారు. పనులకు శంకుస్థాపన చేసిన నాటి నుంచి 100 ఫీట్ల రోడ్డుతో చాలా ఇళ్లతో పాటు వ్యాపార సముదాయాలు పోనుండడంతో 80 ఫీట్ల రోడ్డు పనులు చేయాలా లేదా 100 ఫీట్ల రోడ్డు చేయాలనే దాని పై పలువురితో చర్చించి ఎట్టకేలకు 100 ఫీట్ల రోడ్డు చేయాలని నిర్ణయించి బుధవారం రోడ్డు కొలతను ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో కొలతలు చేపట్టారు. రోడ్డు పనులతో పోయే ఇళ్లకు, వ్యాపార సముదాయాలకు మార్కింగ్ చేశారు. గతంలో ఉన్న ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, సిరికొండ మధుసూదనాచారిల హయాంలో ఈ పనులు జరుగాల్సి ఉండగా కొందరు రాజకీయ నాయకులు ఒత్తిడితో పనులు నిలిపివేశారు. ప్రస్తుతం పనులు ప్రారంభం కావడంతో రోడ్ల వెడల్పుతో మండలకేంద్రం అభివృద్ధి చెందుతుందని కొందరు అంటుండగా రోడ్ల వెడల్పు పనులతో ఎన్నోఏళ్లుగా వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్న తమ భవనాలు కూల్చడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు వెడల్పు పనులతో ఇళ్లతో పాటు ఎంతో విలువైన వ్యాపార భవనాలు కూల్చివేసే విలువ వరకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

మా బతుకులు రోడ్డున పడతాయి



మండలకేంద్ర ప్రధాన రహదారిపై 30 ఏళ్లుగా హోటల్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. రోడ్డు వెడల్పు పేరుతో సుమారు రూ.60 లక్షల విలువ చేసే తమ భవనం సగానికి పైగా పోతుంది. దీంతో తాము రోడ్డు మీద పడే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం మాకు డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేయడంతో పాటు నష్ట పరిహారం చెల్లించాలన్నారు.

- నారగాని కిషోర్, హోటల్ వ్యాపారి

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి



వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

టేకుమట్ల: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండి, అప్రమత్తంగా ఉండాలని సాంస్కృతిక కళాసారథి సభ్యులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో యూఎన్‌కే వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌వ్యాధి సంక్రమణ, పాటించాల్సిన నియమాల పట్ల పాటల రూపంలో అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎయిడ్స్‌కి మందు లేదని, నివారణే ఒక్కటే మార్గమని సూచించారు. ఎయిడ్స్‌వ్యాధి సంక్రమిస్తే మరణమే శరణ్యం అన్నారు. కార్యక్రమంలో కళాకారులు, పంచాయతీ కార్యదర్శి అడగాని సాంబశివుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో కాంగ్రెస్ నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను కాంగ్రెస్ నాయకులు విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలకృష్ణ, మాజీ ఎంపీటీసీ రేవెల్లి మమతనాగరాజు, కాంగ్రెస్ నాయకులు అశోక్, రాజబాపు, లక్ష్మణ్, అరుణ్, ఇమ్రాన్, రజాక్‌లు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న పాఠశాల యాజమాన్యం

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని సెయింట్ మదర్ మేరీ పాఠశాల నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. గురువారం ఉదయం డాక్టర్ ఉడుముల బాల ఆధ్వర్యంలో గ్రామస్తుల సమక్షంలో పూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని కుల, మతాలకు అతీతంగా సెయింట్ మదర్ మేరీ పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం జోకేష్‌రెడ్డి, జయపాల్, పాఠశాల కరస్పాండెంట్ ప్రభాకర్ రెడ్డి, నాయకులు వి.మోహన్‌రెడ్డి, ఆర్.నాగరాజు, ఎల్.రాజబాపు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం

- ఆదివాసీ నవ నిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింహామూర్తి



ర్యాలీ నిర్వహిస్తున్న మొక్కజొన్న రైతులు

వెంకటాపురం(కె) : బాండ్ మొక్కజొన్న సాగు చేసి నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆదివాసీ నవ నిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింహామూర్తి అన్నారు. గురువారం ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో మొక్కజొన్న రైతులకు న్యాయం చేయాలని కోరుతూ యోగితానగర్ గ్రామం నుంచి వెంకటాపురం వరకు రైతులతో కలిసి పాదయాత్ర చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటను సాగుచేసి నష్ట పోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయించి డీలర్లపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం రైతులకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు పూనెం సాయి, రైతులు పాల్గొన్నారు.

మిర్చికి గిట్టుబాటు ధర చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుత్న పోతునేని సుదర్శన్

వెంకటాపురం(కె): రైతులు పండించిన మిర్చి పంటకు గిట్టుబాటు ధర చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. గురువారం మండలంలోని మిర్చి కల్లాలను సీపీఎం బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో మిర్చి రైతుల జిల్లా సదస్సును నిర్వహించారు. సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతులు ఎకరం మిర్చి పంటను సాగు చేసేందుకు అప్పులు చేసి లక్షల రూపాయలు పెట్టుబడులు పెడుతున్నా పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి పంటను మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నారు. క్వింటా మిర్చికి రూ.25 వేలు చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, తుమ్మల వెంకటరెడ్డి, మచ్చా వెంకటేశ్వర్లు, గ్యానం వాసు, చిట్టెం ఆదినారాయణ, కుమ్మరి శ్రీను, కట్ల నర్సింహాచారి, తోట నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర ప్రాంతాల్లో నిరంతర విద్యుత్

- డీఈ పులుసం నాగేశ్వర్‌రావు

ఏటూరునాగారం : ఏజెన్సీలోని మండలాల్లో ప్రజలకు అత్యవసరంగా అందించే కార్యాలయాలకు, ప్రాంతాలకు నిరంతరం విద్యుత్ అందించడానికి విద్యుత్‌శాఖ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తుందని డీఈ పులుసం నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రి, మిషన్ భగీరథ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వేసవికాలంలో సామాజిక ఆస్పత్రికి నిరంతరం విద్యుత్ ఇవ్వడంతో రోగులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, అలాగే మిషన్ భగీరథ ప్లాంట్స్, పరీక్షా కేంద్రాలకు నిరంతరం విద్యుత్ సరఫరా ఇవ్వడానికి నూతనంగా ఆరు ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చినట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా వేసవిలో ప్రజలు కరెంటును ఆదా చేయాలన్నారు. అవసరం లేని సమయంలో కరెంటు వాడకుండా చూసుకోవాలన్నారు. ఏడీ సుధాకర్, ఏఈ అశోక్, సిబ్బంది ఉన్నారు.

ధ్రువీకరణ పత్రాలు యథావిధిగా కొనసాగించాలి

- ఆదివాసీ నాయకపోడు దెబ్బ పొలిట్‌బ్యూరో సభ్యుడు సారయ్యనాయక్

వెంకటాపురం(కె): ఆదివాసీ తెగల కుల ధ్రువీకరణ పత్రాలు యథావిధిగా కొనసాగించాలని ఆది వాసీ నాయకపోడు దెబ్బ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొల్లం సారయ్యనాయక్ అన్నారు. గురువారం ములుగులో ఆదివాసీ తెలగల కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరుతూ జిల్లా కలెక్టర్ దివాకరకు వినతి పత్రాన్ని నాయకపోడు దెబ్బ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీల్లో చిన్న తెగలకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు దక్కడం కోసమే నాయక పోడు పనిచేస్తుందని అన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు నెమలి నర్సయ్య, జన్ను రవి, పూజారి లక్ష్మణ్, రమేష్, రామన్న సమ్మయ్య ఉన్నారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

చిట్యాల : మండలంలోని లక్ష్మీపూర్ తండాలో గురువారం బాల్య వివాహాన్ని సంబంధిత అధికారులు అడ్డుకున్నారు. వివాహానికి సిద్ధపడిన మైనర్ బాలికకు ఇరువురి తల్లిదండ్రులకు వారు కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసుల కథనం ప్రకారం.. చెల్పూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడితో లక్ష్మీపూర్ తండా గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికకు పెళ్లి చేస్తున్నారని స్థానిక సీఐ మల్లేష్ యాదవ్‌కు సమాచారం రావడం జరిగిందని వారు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు సమాచారం అందిన వెంటనే జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పోలీస్, రెవెన్యూ శాఖ సిబ్బందితో కలిసి గ్రామంలో వివాహం జరిగే ప్రదేశానికి వెళ్లి ఇరువురి కుటుంబ సభ్యులతో చర్చించి, ఇరువురు తల్లిదండ్రులకు బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, ప్రభుత్వం తీసుకునే చర్యలను తల్లిదండ్రులకు వివరించామన్నారు. బాలికకు వివాహ వయస్సు రాకుండా పెళ్లి చేయరాదన్నారు. అనంతరం మైనర్ బాలికను బాల సదన్‌కు తీసుకెళ్లి ఉంచడం జరిగిందని అధికారులు పేర్కొన్నారు. బాల్యవివాహాలు చేయ్యడానికి ఎవరు పూనుకున్న టోల్ ఫ్రీ నంబర్ 1098కి సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.కార్యక్రమంలో సెకండ్ ఎస్సై ఈశ్వరయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, కోఆర్డినేటర్ గుర్రం తిరుపతి, కళావతి, సాయిరాం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, హెడ్‌కానిస్టేబుల్ రమేశ్, కానిస్టేబుల్ లింగన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న పోలీసులు

మల్హర్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష సెకండ్ లాంగ్వేజ్ పేపర్‌తో గురువారం ప్రారంభమైంది తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రంలోకి సిబ్బంది విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించి లోపలికి అనుమతించారు. పరీక్ష కేంద్రానికి మండలంలోని తాడిచర్ల జూనియర్ కళాశాల, మల్లారం కస్తూర్బా, ఎడ్లపల్లి మోడల్ పాఠశాలలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 134 మంది గాను 133 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని డీఈసీ (డిస్ట్రిక్ ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్) విజయదేవి తనిఖీ చేశారు.

లారీల రాకపోకలతో రోడ్డు ధ్వంసం

- నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ధ్వంసమైన రోడ్డు

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని లింగాల బీటీ రోడ్డు ధ్వంసమైంది. గతేడాది మహాజాతర సమయంలో పస్రా నుంచి కొడిశాల వరకు బీటీ రోడ్డు వేశారు. కొడిశాల నుంచి పోచాపూర్, లింగాల నుంచి బొల్లెపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఇటీవల రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం పనులకు మెటీరియల్‌ను తీసుకొస్తున్న లారీల రాకపోకలతో రోడ్డు కొడిశాల సమీపంలో ధ్వంసమైంది. లారీల రాకపోకల తాకిడికి రోడ్డు మరింత దెబ్బతినే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు ధ్వంసం కావడంతో రాత్రి వేళలో రోడ్డుపై నుంచి వెళ్లే వాహనదారులు ఆదిమరిచి వెళ్లడంతో ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. అంతే కాకుండా రోడ్డు నిర్మించిన ఏడాదిలోనే భారీ వాహనాల తాకిడికి రోడ్డు ధ్వంసం కావడంపై విమర్శలు వస్తున్నాయి. రోడ్డు నిర్మాణం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతోనే రోడ్డు దెబ్బతింటుందని ఆరోపిస్తున్నారు. ఏడాదిలోపే వాహనాల తాకిడికి రోడ్డు తట్టుకోలేకపోతే పది కాలాల పాటు నిలిచేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్సీల గెలుపుతో బీజేపీ సంబురాలు



కాటారం : సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ శ్రేణులు

భూపాలపల్లి రూరల్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం అంబేడ్కర్ సెంటర్‌లో సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా నాయకుడు దొంగల రాజేందర్ మాట్లాడుతూ కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్‌లలో జరిగిన గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు మల్క కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి ఘన విజయం సాధించడం జరిగిందన్నారు. రానున్న స్థానిక సంస్థల్లో కూడా కాంగ్రెస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని స్థానిక సంస్థల్లో బీజేపీకి మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంబాల రాజయ్య, జిల్లా నాయకులు ఊరటి మునేందర్, నాయకులు, శంకర్, కొమురయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాటారంలో..

కాటారం: మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు గురువారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ బీజేపీ పార్టీని గెలిపించిన పట్టభద్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాగె రంజిత్ కుమార్, ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ దుర్గం తిరుపతి, నాయకులు బండం మల్లారెడ్డి, అంకయ్య, అర్జయ్య, హన్మయ్య, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మహాముత్తారంలో..

మహాముత్తారం మండలం యామన్‌పల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. టాపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్ : స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

మొగుళ్లపల్లి : బీజేపీ మొగుళ్లపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు మోరే వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించినందుకు మండల కేంద్రంలో బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి ఖాయమని అందుకు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం అన్నారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీలని హామీలు ఇచ్చి తుంగలో తొక్కినటువంటి కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొంద పెట్టడం జరిగిందన్నారు. రానున్న స్థానిక సంస్థల్లో కూడా కాంగ్రెస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కుమ్మర సారయ్య, ఇటుకాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో..

కాళేశ్వరం: నిజామాబాద్-మెదక్-కరీంనగర్-ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపుపై మహదేవపూర్ మండలం కాళేశ్వరం బస్టాండ్ వద్ద గురువారం బాణాసంచా కాల్చి సంబురాలను జరుపుకున్నారు. శ్రీకాంత్, కిషన్, దేవయ్య, చరణ్ తదితరులు ఉన్నారు.

చిట్యాలలో..

చిట్యాల : ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ టీఎస్ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి గెలుపు ఉపాధ్యాయుల గెలుపేనని పీఆర్‌టీయూ టీఎస్ మండల ప్రధాన కార్యదర్శి సూదం సాంబమూర్తి అన్నారు. గురువారం మండల విద్యాధికారి కోడెపాక రఘుపతితో పాటు, మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరగాని కృష్ణ, సాంబారు రామనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరం : బస్టాండ్ వద్ద..



మొగుళ్లపల్లి: బాణసంచా కాలుస్తున్న బీజేపీ నేతలు



చిట్యాల : ఎంఈఓకు స్వీట్లు తినిపిస్తున్న ఉపాధ్యాయులు

ప్యూరిఫయర్ బహూకరణ



వాటర్ ప్యూరిఫయర్ బహూకరిస్తున్న శ్రీనివాస్ కుటుంబ సభ్యులు

భూపాలపల్లి రూరల్: సింగరేణి కార్మికుడిగా పనిచేస్తున్న భరత శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా కేంద్రంలోని అమృత వర్షిణి వృద్ధాశ్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి ఆక్వా వాటర్ ప్యూరిఫయర్ మిషన్‌ను బహూకరించారు. ఆశ్రమంలోని వృద్ధులకు భోజనాలు వడ్డించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, ఆశ్రమం నిర్వాహకులు శైలజ శ్యామ్ ప్రసాద్, ఆత్మీయత సేవా సొసైటీ అధ్యక్షుడు బయ్యన మహేందర్, తదితరులు పాల్గొన్నారు.